www.vastavam.in

# వాస్తవం.ఇన్

డిజిటల్ పత్రిక

ఎడిటర్: దండుగుల శ్రీనివాస్

News you can trust

| శనివారం | 12-07-2025 |

## జూబ్లీహిల్స్‌లో రూ. 5కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు

- ప్రారంభించిన మంత్రులు పొన్నం, వివేక్, తుమ్మల



**వాస్తవం, హైదరాబాద్:**

జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో శుక్రవారం రూ.5 కోట్లకు పైగా నిధులతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసినట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. యూసుఫ్‌గూడ సర్కిల్‌లోని వెంగళ్‌రావు నగర్‌లో సీసీ రోడ్ల నిర్మాణానికి మంత్రులు వివేక్ వెంకటస్వామి, తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో అన్ని సమస్యలు పరిష్కరిస్తున్నామన్నారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత హైదరాబాద్ నగరంలో బస్తీలు, కాలనీల అభివృద్ధి చెందలేదని పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో నేతలు తాము ప్రాతినిధ్యం వహించిన నియోజకవర్గాల్లో మాత్రమే వివక్షపూరి తంగా అభివృద్ధి చేసుకున్నారని విమర్శించారు. హైదరాబాద్ పరిధిలోని నియోజకవర్గాలను అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు రూపొందించినట్టు తెలిపారు.



# ఒకడుగు ముందుకు.. నాలుగడుగులు వెనక్కి..!

## రాజాసింగ్ రాజీనామా ఆమోదంతో పార్టీపై నెగెటివ్ టాక్..

బీజేపీకి అధికారం పక్కా. మేమే ఇక రాబోవు కాలంలో. బీఆరెస్‌ను పట్టించుకోవడం లేదు. కాంగ్రెస్‌పై వ్యతిరేకత పెరిగింది. మేమే మేమే. మాకే మాకే . బీజేపీ నేతలంతా ఇదే పాట. మొన్నటి దాకా. నిజమేననిపించింది చాలా మందికి ఇది. అట్లనే ఉంది పరిస్థితి అని కూడా అనుకున్నారు. కానీ ఏమైందో ఏమో.. ఈ మధ్యకాలంలో జరిగిన పరిణామాలు అందరినీ ఆశ్చర్యానికి గురి చేస్తున్నాయి. ఆ పార్టీ తీసుకుంటున్న నిర్ణయాలు నివ్వెరపోయేలా చేస్తున్నాయి. పార్టీ అధ్యక్ష పదవి నుంచి మొదలైంది ఈ కథ. ఆ తరువాత చాలానే ప్రచారాలు చేశారు. పార్టీని ముందుకు పోనీయకుండా కావాలనే ఇది చేస్తున్నారా..? అనే ప్రచారాలు ఆ పార్టీ నేతల నుంచే రావడం .. అధిష్టానం నిర్ణయాలు ఎంతటి ప్రభావాన్ని చూపుతున్నాయో అర్థం చేసుకోవచ్చు.

### రాష్ట్ర అధ్యక్ష పదవిపైనా పెదవి విరుపే..

### ఎవరికి వారే యమునా తీరే అన్న చందంగా గ్రూపులు..

### ఊపందుకుంటున్న సమయంలో బ్రేకులు వేస్తున్న నిర్ణయాలు



(దండుగుల శ్రీనివాస్)

తాజాగా రాజాసింగ్ రాజీనామా ఎపిసోడ్ పార్టీనికి మరింత ఇబ్బందిపెట్టింది. వాస్తవానికి రాజాసింగ్ ఆవేదనలో అర్థం ఉంది. దీన్ని లైట్‌గా తీసుకుని బుజ్జగిస్తే సరిపోయేది. కానీ గ్రూపుల వివాదాలు, ఆధిపత్య ధోరణలు దీన్ని గోటితో పోయేదాన్ని గొడ్డలి దాకా తెచ్చారు. రాజాసింగ్ రాజీనామాలను అధిష్టానం ఆమోదించేలా చేసింది కిషన్‌రెడ్డే. పార్టీని అస్సలే ముందుకు పోనిస్తలేడనే అపవాదు, ప్రచారం మూటగట్టుకున్న కిషన్‌రెడ్డి.. రాజాసింగ్ విషయంలో ఇలాంటి దూకుడు నిర్ణయాలు తీసుకోవడం మరింత ఇబ్బందికరంగా మారింది. రాజాసింగ్‌పై సోషల్ మీడియాలో సానుభూతి వ్యక్తమవుతున్నది. అతన్ని సపోర్టు చేసేవాళ్లే చాలా మంది ఉన్నారు. ఇప్పుడు రాజీనామా ఆమోదం విషయంలో అధిష్టానం నిర్ణయం సబబే అని కూడా చెప్పే పరిస్థితిలో ఎవరూ లేరు. అలా చెబితే పార్టీకి మరింత డ్యామేజీ అవుతుందనే భయం వారిలో ఉంది.

ఇప్పటికే స్టేట్ బీజేపీలో గ్రూపులు పార్టీని భ్రష్టు పట్టిస్తున్నాయి. బండి సంజయ్, ఈటల రాజేందర్, రఘునందన్‌రావు, కిషన్‌రెడ్డి, తాజాగా రాంచంద్రారావు.. వీరే కాదు అర్వింద్ తను నిజామాబాద్ పార్లమెంటు పరిధిలో సపరేటే బీజేపీనే రన్ చేస్తున్నాడు. ఎవరికి వారే యమునా తీరే చందంగా మారిన నేతలు.. పార్టీని గాడిన పడేయడం అటుంచి మరింత కిందికి దిగజారుస్తున్నారు. అంతా లీడర్ల రాజకీయం నడుస్తున్న తరుణంలో.. హార్డ్ కోర్ క్యాడర్ మాత్రం పార్టీని భుజానేసుకుని ముందుకు భారంగా ఈడుస్తున్నారు. ఒకడుగు ముందుకు పోతే.. లీడర్ల కారణంగా, వారి వ్యవహారం, చేష్టల మూలంగా నాలుగడుగులు వెనక్కి పడుతున్నాయి.

## కొండంత రాగం తీసి...!

- బీసీ రిజర్వేషన్లపై ఆర్డినెన్స్ ప్రకటనతో రైల్‌రోకో వాయిదా
- వెల్లడించిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



**వాస్తవం, హైదరాబాద్:**

బీసీ రిజర్వేషన్లపై ఆర్డినెన్స్ తీసుకొస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో ఈనెల 17న చేపట్టిన రైల్ రోకో కార్యక్రమాన్ని వాయిదా వేస్తున్నట్లు బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత ప్రకటించారు. ఆర్డినెన్స్ తీసుకునిరావడాన్ని తెలంగాణ బీసీ బిడ్డలు, జాగృతి విజయంగా భావిస్తున్నామని ఎమ్మెల్సీ కవిత అన్నారు. ప్రజా ఉద్యమాల ద్వారా ఒత్తిడి తేవడంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని చెప్పారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో కవిత మాట్లాడారు. బీసీ బిల్లును షెడ్యూల్-9లో పెట్టాలి. దీనికోసం బీసీ బిడ్డ, కేంద్రమంత్రి బండి సంజయ్ చొరవ తీసుకో వాలి. ఆర్డినెన్స్ తీసుకొస్తామని చెప్పినందున ఈ వారం రోజులు ప్రభుత్వ కార్యాచరణను గమనిస్తాం. దీనిపై ముందుకెళ్లకపోతే రైల్ రోకో చేపడతాం అని కవిత అన్నారు. అంతకు ముందు బంజారాహిల్స్‌లోని తన నివాసం నుంచి జాగృతి శ్రేణులతో ర్యాలీగా లోయర్ ట్యాంక్‌బండ్‌కు వెళ్లారు. అక్కడ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఆమె నివాళుల ర్పించారు. స్థానిక ఎన్నికలకు ముందే 42 శాతం బీసీ రిజర్వేషన్లపై ఆర్డినెన్స్ తీసుకొ స్తామని మంత్రి పొంగులేటి చెప్పారు. ఈ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం. ప్రభుత్వ ప్రకటన నేపథ్యంలో ఈనెల 17న చేపట్టిన రైల్ రోకో కార్యక్రమాన్ని వాయిదా వేస్తున్నామని అన్నారు. అయితే మాకు కొన్ని అనుమానాలు కూడా ఉన్నాయి. ఆర్డినెన్స్ ఇచ్చి వెంటనే రిజర్వేషన్లు అమలు చేయగలిగితే అధికారంలోకి వచ్చిన 18 నెలలు ఎందుకు ఆగారని అన్నారు. రాజకీయ లబ్ధి కోసమే అలా చేశారని మేం భావిస్తున్నాం. కాంగ్రెస్ ఇచ్చిన హామీల నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకే రిజర్వేషన్ల చుట్టూ రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు.

# బీసీలకు, ఆమెకు ఏం సంబంధం..!?

### కవితను చూసి జనం నవ్వుకుంటున్నారు..!

### కవిత ప్రకటనలపై పీసీసీ చీఫ్ ఎద్దేవా



**వాస్తవం, హైదరాబాద్:**

బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమ లుపై రాష్ట్ర ప్రభుత్వం చరిత్రాత్మక నిర్ణయం తీసుకుందని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. ఈ నిర్ణయం వెనక ఖర్గే, రాహుల్‌గాంధీ ఆశయం ఉందని చెప్పారు. సామాజిక న్యాయం కాంగ్రెస్‌తోనే సాధ్య మని మరోసారి నిరూపితమైందని చెప్పా రు. బీసీల అభ్యున్నతికి కాంగ్రెస్ పార్టీ ఎనలేని కృషి చేస్తోందని వివరించారు. అయితే బీసీ రిజర్వేషన్లకు భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్సీ కవితకు ఏం సంబంధం అని ప్రశ్నించారు. మేం చేసిన దానికి ఆమె క్రెడిట్ తీసుకోవడమేంటని, కవితను చూసి జనాలు నవ్వుకుంటున్నారని అన్నారు. ఆమె ఉద్యమిస్తే మేం ఆర్డినెన్స్ తెచ్చామా అని ఎద్దేవా చేశారు. కేసీఆర్ పదేళ్లు ఏం వెలగబెట్టారని ఆమె బీసీ పాట పాడుతు న్నారు. బీసీ రిజర్వేషన్లు రాహుల్ అజెండా, రేవంత్ నిబద్ధత అని మహేశ్‌కుమార్ గౌడ్ తెలిపారు. కవితకు రాజకీయంగా ఎక్కడా చోటు లేకపోవడంతో డ్రామాలు ఆడుతు న్నారని మండిపడ్డారు. శుక్రవారం ఆయ న మీడియాతో మాట్లాడుతూ.. బీసీలకు కాంగ్రెస్ మేలు చేస్తే కవిత ఎందుకు రం గులు పులుముకుంటుందని ప్రశ్నించారు. కవితకు, భవితకు సంబంధం లేదని అన్నారు. రాహుల్ గాంధీ ఆదేశం మేరకు రేవంత్ రెడ్డి బీసీ రిజర్వేషన్లను అమలు చేస్తున్నారని చెప్పారు. గత బీఆర్ఎస్ ప్రభు త్వం బీసీలను వంచించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీ రిజర్వేషన్లు తగ్గించిన ఘనత కేసీఆర్ దని అన్నార. కేసీఆర్ కూతురైన కవిత పండుగ చేసుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. బీసీ నేతలు ఆత్మ విమర్శ చేసుకోవాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్ లో భాగంగా ఇచ్చిన హామీని నిలబెట్టు-కుందని చెప్పారు. బీసీల విషయంలో చిత్తశుద్ధితో ముందుకు వెళ్తున్నట్టు చెప్పారు.

# కాళేశ్వరంపై కంగాళీ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్..!

- కేబినెట్ నిర్ణయాలు.. అసెంబ్లీ ఆమోదించిన వివరాలు అందచేత
- కాళేశ్వరంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ తప్పలతడక
- విమర్శలు గుప్పించిన మాజీమంత్రి

**వాస్తవం, హైదరాబాద్:**

కాళేశ్వరం కమిషన్ చీఫ్ జస్టిస్ పినాకి చంద్రఘోష్ ముందు విచారణకు మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు శుక్రవారం హాజ రయ్యారు. బీఆర్‌కే భవన్‌లో మరోసా రి పీసీ ఘోష్ కమిషన్‌ను హరీష్‌రావు కలిశారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై మరిం త అదనపు సమాచా రాన్ని ఇచ్చారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్లపై ఆరుసార్లు కేబినెట్ ఆమోదం పొందిందని గుర్తుచేశారు మాజీ మంత్రి హరీష్‌రావు. అసెంబ్లీలో కూడా మూడుసార్లు ఆమోదించారని మాజీ మంత్రి హరీష్‌రావు తెలిపారు. ఈ వివరాలన్నీ డాక్యుమెంట్లతో సహా కమిషన్‌కు ఇచ్చానని చెప్పుకొచ్చారు. మిగిలిన వివరాలు రేవంత్ ప్రభుత్వం దగ్గరే ఉన్నాయని వివరించారు. కమిషన్‌కు కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి సమాచారం ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై సీఎం రేవంత్‌రెడ్డి చెప్పినవన్నీ అసత్యాలేనని ఆరోపించారు. 50 ఏళ్లుగా కాంగ్రెస్‌వి అబద్ధాలు, మోసాలేనని విమర్శించారు. కృష్ణా జలాల్లో 299 టీ-ఎంసీల కేటాయింపు కాంగ్రెస్ పాపమేనని మండిపడ్డారు.

